సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ డిమాండ్ చేశారు. 10లో▸



మాకు న్యాయం చేయండి

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో తమకు అన్యాయం జరిగిందని బండలేమూర్‌కు చెందిన గిరిజనులు ఆరోపించారు. 10లో▸



ఉపాధి అవకాశాలు

విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ నర్సింహ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

సదస్సును జయప్రదం చేయండి

షాద్‌నగర్‌రూరల్: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యలు –పరిష్కార మార్గాలు' అంశంపై మంగళవారం నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య హాజరుకానున్నట్టు తెలిపారు. పట్టణంలోని మినీ యూనివర్సల్ హాల్‌లో మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే సెమినార్‌కు నియోజకవర్గంలోని వ్యవసాయ కార్మికులు, మేధావులు, విద్యావంతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విధి నిర్వహణలో ప్రజలతో మమేకమవ్వాలి

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

శంకర్‌పల్లి: ప్రతి ఉద్యోగి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే ప్రజలతో మమేకమవ్వాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శంకర్‌పల్లి పట్టణంలో సోమవారం నిర్వహించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దామోదర్ దంపతులకు గజమాల, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. 27 ఏళ్ల వైద్య రంగంలో దామోదర్ ఎన్నో ఎత్తుపల్లాలు చూసారని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు తాపత్రేయపడేవారన్నారు. ప్రతి ఒక్కరూ ఆ విధంగా తమ ఉద్యోగ జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, చేవెళ్ల డివిజన్ లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చౌదర్‌పల్లి కార్యదర్శిని సస్పెండ్ చేయండి



యాచారం: వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని సమాజ్ వాద్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటికల శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. చౌదర్‌పల్లి గ్రామంలో ఆస్తి విలువ పత్రం జారీలో కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా బలవన్మరణానికి పాల్పడిన మధుసూదన్ కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు.

జిల్లాకు కొత్త బాస్

నూతన కలెక్టర్‌గా నారాయణరెడ్డి

- ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల విభాగం కమిషనర్‌గా శశాంక బదిలీ
- ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు సైతం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా నూతన కలెక్టర్‌గా సి.నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన శశాంకను రాష్ట్ర ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల విభాగం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కలెక్టర్‌గా నారాయణరెడ్డి మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

రైతు కుటుంబంలో పుట్టి..

నారాయణరెడ్డిది మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలంలోని శ్రీపురం. తండ్రి చెన్నారెడ్డి, నర్సింగమ్మ, నలుగురు అన్నలు, ఒక అక్క. నాన్నా, సోదరులతో కలిసి వ్యయసాయం చేసేవారు. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నాన్నా చనిపోయారు. చదువు ఆపేద్దామని నిర్ణయించుకుని, పొలం బాట పట్టారు. ఆ తర్వాత అక్షరాలపై ఉన్న మమకారంతో మళ్లీ చదువుపై దృష్టిసారించారు. ఒకవైపు పొలం పనులు చేస్తూనే మరోవైపు చదువుకునేవాడు. పదో తరగతిలో మంచి మార్కులు వచ్చాయి. దీంతో హైదరాబాద్‌కు చేరుకున్నారు. పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూనే..ఇంటర్ పూర్తి చేశారు. ఉస్మానియాలో బీఈడీ, ఎంఎస్సీ చేశారు. కష్టాలెన్ని ఎదురైనా చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. 2006 డీఎస్సీలో మహబూబ్‌నగర్ జిల్లా టాపర్‌గా నిలిచారు. ఆ డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వడంలో జాప్యం చోటు చేసుకోవడంతో మక్తలోని ఓ ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. పెద్ద చదువులు చదివి తక్కువ జీతానికి, చిన్న స్కూల్లో ఎలా పని చేస్తున్నావని అంతా ప్రశ్నించేవారు. అయినా ఆయన మాత్రం అధైర్యపడలేదు.

ఏడాది గడవకముందే..

ఏడాది వ్యవధిలోనే జిల్లాలో ముగ్గురు కలెక్టర్లు మారడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి కలెక్టర్ హరీశ్‌పై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేయగా, ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన భారతి హోళికేరి ధరణి దరఖాస్తుల పరిష్కారంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత మేడ్చల్ కలెక్టర్ గౌతం పోట్రుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, ఆ తర్వాత శశాంకను పూర్తి స్థాయి కలెక్టర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కలెక్టర్ శశాంకను తాజాగా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల కమిషనర్‌గా బదిలీ చేయడం కొసమెరుపు.

ఆర్డీఓల నియామకం

నర్సాపూర్ ఆర్డీఓగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి కందుకూరు ఆర్డీఓగా నియమితులయ్యారు. జీపీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.చంద్రకళను చేవెళ్ల ఆర్డీఓ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా, చీఫ్ ఎలక్షన్ ఆఫీస్‌లో పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎన్ఆర్ సరిత షాద్‌నగర్ ఆర్డీఓగా నియమితులయ్యారు. జల్‌పల్లి, మీర్‌పేట్, బడంగ్‌పేట్, తుక్కుగూడ, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్లకు స్థాన చలనం కల్పించడం విశేషం.



ఉపాధ్యాయుడిగా సంతృప్తి చెందక

2008లో తను చదివిన బడిలోనే టీచర్‌గా పోస్టింగ్ వచ్చింది. ఉపాధ్యాయుడిగా ఎంపికైనా జీవితంలో అసంతృప్తి అలాగే ఉంది. చిన్నప్పటి నుంచి కలెక్టర్ కావాలనే కలను సాకారం చేసుకునేందుకు అక్కడే ఒక చిన్నగదిని అద్దెకు తీసుకుని చదువుకున్నారు. ఒకవైపు బడిలో పాఠాలు చెబుతూనే ..మరోవైపు చదువును కొనసాగించారు. 2009లో తొలి ప్రయత్నంలోనే గ్రూప్–1లో స్టేట్ నాలుగో ర్యాంకు సాధించారు. 2011లో గద్వాల ఆ తర్వాత పెద్దపల్లి, సూర్యాపేటలో ఆర్డీఓగా పని చేశారు. జిల్లాల విభజన సమయంలో నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అవకాశం దక్కింది. ఆ తర్వాత ములుగు, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల కలెక్టర్‌గా పని చేశారు. ఇటీవల నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లి.. తాజాగా రంగారెడ్డి కలెక్టర్‌గా నియమితులయ్యారు.

రైతు సమస్యలపై నిరసన



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని, భరోసా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా సగం మందికి కూడా కాలేదని అన్నారు. రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం భరోసా పథకం కింద వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగనందున లక్షలాది మంది రైతులు అసంతృప్తితో ఉన్నారన్నారు. రైతు భరోసా ఎకరానికి రూ.7,500 చొప్పున వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు చల్లా నారాయణరెడ్డి, బాలయ్య, రజినీకాంత్, బాల్‌రెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి అంజయ్య, రమావత్ చత్రునాయక్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బడంగ్‌పేట్ కమిషనర్



ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టర్ శశాంకను బడంగ్‌పేట్ కార్పొరేషన్ నూతన కమిషనర్ సరస్వతి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కలిసి పూల మొక్కలు అందజేశారు. కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: ఆక్రమణకు గురైన మండల పరిధిలోని సుర్మాయిగూడ సర్వేనంబర్ 128/1లోని 0.25 గుంటల ప్రభుత్వ భూమిని అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలం క్రితం సదరు భూమిని కొంతమంది ఆక్రమించుకుని రోడ్లు వేసి కడీలు పాతి ఇతరులకు విక్రయించారు. ఈ మేరకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్లను, కడీలను తొలగించి ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వేయర్ జ్యోతి, గిర్దవార్ నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకాక్‌కు థాయ్ ఎయిర్ ఏషియా విమాన సర్వీసులు

శంషాబాద్: హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు థాయ్ ఎయిర్ ఏషియా విమాన సర్వీసులను ఆదివారం రాత్రి నుంచి ప్రారంభించింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారం రోజుల్లో సోమ, బుధ, శుక్ర, ఆదివారాల్లో రాత్రి 11.25 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి బ్యాంకాక్‌లోని డాన్ మయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తెల్లవారు జామున 4.30 గంటలకు చేరుకుంటుంది. ఈ సందర్భగా ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ..పర్యాటక ప్రాంతమైన బ్యాంకాక్‌కు హైదరాబాద్ నుంచి నేరుగా సర్వీసులు పెంచడం ప్రయాణికులకు మరింత సౌలభ్యం పెరుగుతోందన్నారు.

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- ప్రజావాణి అర్జీలపై సత్వరమే స్పందించాలి
- వీలైనంత త్వరగా పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశాలు



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ శశాంకతో పాటు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అక్కడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించాలని, పెండింగ్‌లో పెడితే సహించేది లేదని హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులు క్రమం తప్పకుండా ప్రజావాణికి రావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి–42, ఇతర శాఖలకు 18 అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటిండెంట్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న టీపీయూఎస్ నాయకులు

చేవెళ్ల: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం అన్ని మండలకేంద్రాల్లోని తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యకు టీపీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురధీర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు మోర లక్ష్మణ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశ్‌గౌడ్, సభ్యులు కరుణాకర్‌రెడ్డి, హరిశంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయండి



నూతన చైర్మన్ పెంటయ్యగౌడ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గం

చేవెళ్ల: మార్కెట్ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం నూతన పాలకవర్గం చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పాలకవర్గం సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. చేవెళ్ల మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని సూచించారు. రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని, తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ పెంటయ్యగౌడ్, రాములు మాట్లాడుతూ.. తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటామని చెప్పారు. మార్కెట్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పి.లలిత, యాదిరెడ్డి, మల్లేశ్, బాలయ్య, నరేందర్, హనీఫ్, ఎ.కృష్ణారెడ్డి, టి.జనార్దన్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, సుదర్శన్, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు ఇక రెండంచెల్లో..

లే అవుట్లు, ఎల్ఆర్ఎస్ తదితర ఫైళ్ల పరిశీలన విధానంలో మార్పు

- మొదట స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలన
- తరువాత హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం పరిశీలన
- అనంతరమే అనుమతులు మంజూరు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిబంధనలను మరింత కఠినతరం చేసింది. వివిధ రకాల అనుమతులపై నీటిపారుదల, రెవెన్యూ విభాగాల తనిఖీలు, క్షేత్రస్థాయి నివేదికల అనంతరమే హెచ్ఎండీఏ అనుమతులు లభించనున్నాయి. ఇప్పటి వరకు హెచ్ఎండీఏ పర్యవేక్షణలోనే అన్ని రకాల డాక్యుమెంట్లను పరిశీలించి అనుమతులు ఇచ్చే అవకాశం ఉండగా, ఇక నుంచి రెవెన్యూ, నీటిపారుదల విభాగాల అనుమతులను కూడా తప్పనిసరి చేశారు. అంటే లే అవుట్‌లు, ఎల్ఆర్ఎస్‌లు, భవన నిర్మాణాలు తదితర అనుమతుల కోసం హెచ్ఎండీఏకు చేరే దరఖాస్తులను రెండంచెల్లో సమగ్రంగా పరిశీలించి అనుమతులు అందజేస్తారు. ఇప్పటికే టీజీబీపాస్ ద్వారా వచ్చిన దరఖాస్తులపైన కూడా క్షేత్రస్థాయి పరిశీలనను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు హెచ్ఎండీఏలో ఫైళ్ల పెండింగ్ జాబితా పెద్దఎత్తున పెరిగిపోతుండగా, తాజా నిబంధనల నేపథ్యంలో ఫైళ్ల పరిష్కారంలో మరింత జాప్యం చోటుచేసుకొనే అవకాశం ఉందని నిర్మాణ సంస్థలు, స్థలాల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అనంతరం వందల కొద్దీ ఫైళ్లు పెండింగ్‌లో పడిపోయాయి. కొన్నింటికి అవసరం ఉన్నా లేకున్నా ఇరిగేషన్, రెవిన్యూ విభాగాల నుంచి నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) తప్పనిసరి చేస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అన్ని రకాల ఫైళ్లకు దరఖాస్తు దశలోనే రెవిన్యూ, ఇరిగేషన్ విభాగాల నుంచి క్లియరెన్స్‌ను కోరడం గమనార్హం.

రెండో దశలో ప్రణాళికా విభాగం..

- మొదట టీజీబీపాస్‌లకు అందిన దరఖాస్తులను రెవిన్యూ, ఇరిగేషన్ విభాగాల పరిశీలనకు పంపిస్తారు. ఇరిగేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్, రెవిన్యూలో డిప్యూటీ తహసీల్దార్ లేదా అంతకంటే ఉన్నత స్థాయికి చెందిన అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. చెరువులు, కుంటలు, తదితర నీటి వనరులు, ప్రభుత్వ భూములు, యూఎల్‌సీ వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారు. అన్ని విధాలుగా ఎలాంటి ఆటంకాలు లేవని తేలిన తరువాత ఫైల్ ముందుకు వెళ్తుంది.
- రెండో దశలో హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో సంబంధిత జోన్‌కు చెందిన ప్లానింగ్ అధికారి మరోసారి ఫైల్‌ను పరిశీలిస్తారు. రెవిన్యూ. ఇరిగేషన్ విభాగాల నుంచి వచ్చిన క్లియరెన్స్‌పైన సంతృప్తి చెందితేనే ఫైల్ పైకి వెళ్తుంది.
- అనంతరం ప్లానింగ్ అధికారి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా ప్లానింగ్ డైరెక్టర్ పరిశీలించి కమిషనర్ ఆమోదం కోసం ఫైల్‌ను అందజేస్తారు. ఇలా వివిధ దశలను దాటుకొని ఉన్నతాధికా రుల ఆమోదం పొందిన తరువాత మాత్రమే లే అవుట్‌లు, భవననిర్మాణాలు, ఎల్ఆర్ఎస్ తది తర అన్ని రకాల అనుమతులు లభిస్తాయి. షార్ట్‌ఫాల్స్ నెపంతో దరఖాస్తుల పరిశీలనలో కాలయాపనకు తావు లేకుండా వారం, పది రోజుల్లోనే అనుమతులను ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు ఉన్న పద్ధతికి భిన్నంగా మరో రెండు విభాగాల అనుమతులను తప్పనిసరి చేయడం వల్ల మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

hmda Growing Global

మాస్టర్‌ప్లాన్ ఒక్కటే కాదు..

వివిధ రకాల అనుమతులపైన ఇప్పటి వరకు హెచ్ఎండీఏ అధికారులు 2013 లో రూపొందించిన 2031 మాస్టర్‌ప్లాన్‌ను ప్రామాణికంగా తీసుకున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో నమోదైన ప్రకారంగా అనుమతులను ఇచ్చారు. కానీ ఇప్పుడు హైడ్రా రాకతో మాస్టర్ ప్లాన్‌ను పక్కన పెట్టారు. ట్రోపోగ్రఫీ ఆధారంగా నీటివనరులను గుర్తిస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు. 'మాస్టర్‌ప్లాన్‌లో చెరువులు, కుంటలు, నివాస ప్రాంతాలు, రోడ్లు, పరిశ్రమలు, అటవీప్రాంతాలు వంటి వివిధ కేటగిరీలు స్పష్టంగా ఉన్నాయి. అందులో సూచించిన విధంగానే అనుమతులను ఇచ్చాం. ఇప్పుడు హైడ్రా సూచన మేరకు ట్రోపోగ్రఫీని కూడా పరిగణనలోకి తీసుకోవలసి వస్తుంది' అని వివరించారు. 'ఇలాంటి సందర్భాల్లో ట్రోపోగ్రఫీ ఆధారంగా కాలువలు, వరద కాలువలు ఉన్నట్లుగా అనుమానం వస్తే ఇరిగేషన్ అనుమతిని కోరుతున్నాం.' అని చెప్పారు. దీంతో సొంత ఇల్లు కట్టుకోవాలని ఆశించే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకు కొంత ఇబ్బందిగానే ఉంటుంది.

'ధరలు' పేలుతున్నాయి!

గత ఏడాది కంటే 20 శాతం వరకు పెరిగిన టపాసుల రేట్లు

- కేజీ సేల్, ఫ్యామిలీ ప్యాక్‌లతో ఆఫర్లు
- భారీ అంచనాలతో దివాళీ క్రాకర్స్ స్టాల్స్



సాక్షి, సిటీబ్యూరో: దీపావళి సందడి మొదలైంది. ఎక్కడ చూసినా క్రాకర్స్ స్టాల్స్ అందుబాటులోకి వచ్చాయి. ధరలు పేలుతున్నాయని కొనుగోలుదారులు గగ్గోలుపెడుతున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది 15 నుంచి 20 శాతం ధరలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో కేజీ సేల్ అంటూ కొందరు వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుండగా, మరికొన్ని దుకాణాల్లో మాత్రం క్వాలిటీకే మేం ప్రాధాన్యత ఇస్తున్నాం.. ధరలు ఎక్కువైనా కస్టమర్స్ మమ్మల్ని ఆదరిస్తారని అంటున్నారు. కేజీ సేల్‌లో టపాసులను తేలికైనవి, బరువైనవి రెండు రకాలుగా విభజించి కేజీ రూ.450 నుంచి రూ.1200 వరకు అమ్ముతున్నారు. ఈ కేటగిరీలో గత ఏడాది సుమారు రూ.350 నుంచి రూ.900 వరకు లభించేవి. ఫ్యామిలీ ప్యాక్స్ అంటూ కొన్ని రకాల ప్యాకేజీలు అందుబాటులో ఉంటున్నాయి. ఒక్కో ప్యాక్ రూ.2,500 నుంచి రూ.6 వేల వరకు ధర పలుకుతోంది. బాంబులతో పాటు విద్యుత్ దీపాలు, మట్టి ప్రమిదలకు మార్కెట్‌లో డిమాండ్ నెలకొంది. కొత్త మోడల్ ఎల్ఈడీ విద్యుత్ సీరియల్ సెట్ దీపాలు ప్రత్యేక ఆఫర్లతో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. చిన్నపిలు కాల్చే తాళ్లు, మతాబులు, కాకరపువ్వొత్తులు, అగ్గిపెట్టెలు, ఇతర రకాల వస్తువుల కంటే మార్కెట్‌లో 1000 వాలా నుంచి 10,000 వాలా వరకు, హైడ్రోజన్, లక్ష్మీ బాంబులు, తారాజువ్వలు, చిచ్చుబుడ్డీలు, బుల్లెట్ బాంబ్, మతాబులు, ఇతర వెలుగులు విరజిమ్మే రకాలు, పెద్ద శబ్ద వచ్చే రకాల బాంబులకు గిరాకీ ఉంటోందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఎమ్మార్పీకి కొంటే మోసపోతారు..

టపాసుల విషయంలో వాస్తవానికి వస్తువుల ప్యాకింగ్‌పై ఉన్న ఎమ్మార్పీ (గరిష్ఠ ధర) ధరలకు వినియోగదారులకు విక్రయించే ధరలకు ఏమాత్రం పొంతన ఉండటంలేదు. కొన్ని రకాల ప్యాక్‌లపై రూ.వేలల్లో ఎమ్మార్పీ ముద్రించినా ఆ ప్యాక్‌లు రూ.వందల్లోనే దొరుకుతున్నాయి. ఉదాహరణకు 10 థౌజండ్ వాలా ఎమ్మార్పీ సుమారుగా రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటున్నాయి. అమ్మకానికి వచ్చేసరికి రూ.4,500 నుంచి రూ.8 వేలకు ఇస్తున్నారు. హైడ్రోజన్ బాంబుల (10 పీసెస్) బాక్సుపై ముద్రించిన ధర రూ.670 నుంచి రూ.950 వరకు ఉంటున్నా వీటిని మార్కెట్‌లో రూ.250 నుంచి రూ.350 మధ్యలో లభిస్తున్నాయి. ఎమ్మార్పీలో కనీసం 20 శాతం నుంచి 60 శాతం వరకు రాయితీపై అమ్ముతున్నారు.

హత్య కేసు నిందితుడికి యావజ్జీవ శిక్ష

రూ.15 వేల జరిమానా

- తీర్పు వెల్లడించిన న్యాయస్థానం


అంజయ్య

కొందుర్గు: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. ఈ మేరకు జిల్లేడ్ చౌదరిగూడ ఎస్ఐ విజయ్ వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరి గూడ మండలం కాస్లాబాద్ గ్రామానికి చెందిన తట్టి పల్లి రాజు, అదే గ్రామానికి చెందిన గంజేటి అంజయ్య స్నేహితులు. తరచూ కలిసి మద్యం తాగేవారు. రాజుకు పెళ్లి కాలేదు. అంజయ్యకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. 2020 ఆగస్టులో భార్య పుట్టింటికి వెళ్లడంతో అంజయ్య ఇంట్లో ఇద్దరూ మద్యం తాగారు. అదే సమయంలో ఇంట్లోని రూ.వెయ్యి కనిపించడం లేదని, ఈ డబ్బులు రాజు తీసుకున్నాడనే నెపంతో ఇరువురి మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలో ఘర్షణ పెరిగింది. ఆగ్రహానికి లోనైన అంజయ్య.. గొడ్డలితో రాజును నరికి చంపాడు. అంతే కాకుండా మృతదేహాన్ని కత్తితో మూడు ముక్కలు చేసి.. తల భాగం గ్రామంలోని మురుగు కాలువలో, నడుము, కాళ్ల భాగం గ్రామ శివారులోని పాడుబడిన బావిలో పడేశాడు. మూడు రోజుల అనంతరం పశువుల కాపరులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. మృతుడి అక్క బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో సీఐ రామకృష్ణ నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాలుగేళ్ల పాటు విచారణ కొనసాగగా.. న్యాయస్థానం సోమవారం తీర్పు వెల్లడించింది. తొమ్మిదో తరగతి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీష నిందితుడు అంజయ్యకు జీవితకాల కారాగార శిక్షతోపాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు దర్యాప్తు చేసిన సీఐలు రామకృష్ణ, సత్యనారాయణ, ఎస్ఐ కృష్ణలతోపాటు పోలీసు బృందాన్ని అభినందించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి

చికిత్స పొందుతూ డ్రైవర్ దుర్మరణం


రాంబాబు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చండూరు మండలం నెర్మట గ్రామానికి చెందిన బొండు రాంబాబు(24) వృత్తి రీత్యా లారీ డ్రైవర్. సూర్యాపేట జిల్లా మట్టంపల్లిలోని ఎన్‌సీఎల్ కంపెనీలో సిమెంట్ లోడు వేసుకుని లారీతో మియాపూర్‌కు వస్తుండగా సోమవారం తెల్లవారుజామున మార్గమధ్యలో బాటసింగారం మౌంట్ ఒపెరా వద్దకు రాగానే రోడ్డుపై ఎలాంటి సూచిక బోర్డులు పెట్టకుండా నిలిపిన లారీని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన రాంబాబును చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాకు న్యాయం చేయండి

మంచాల: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో తమకు అన్యాయం జరిగిందని సోమవారం మండంలోని బండలేమూర్ గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఆరోపించారు. ఈ మేరకు మంచాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులైన ఇస్లావత్ సీతారాం, లక్ష్మణ్, బాలు, సోనా, అనిత, వనిత, చాంది మాట్లాడుతూ.. బండలేమూర్ గ్రామంలో తమ తాతలు కొనుగోలు చేసిన భూమిని గతంలో రెవెన్యూ అధికారులు రికార్డులో సక్రమంగా రాయకుండా ఇతరుల పేర్ల మీద రాసి మాకు అన్యాయం చేశారని వాపోయారు. 906 సర్వే నంబర్‌లో తమకు 12 ఎకరాల భూమికి బదులు పది ఎకరాలు మాత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిగి న్యాయం చేయాలని కోరారు. ఇదే విషయంపై తహసీల్దార్‌కు విన్నవించామని పేర్కొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన రైతులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగామ: బైక్‌ను ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మేకగూడ శివారు దర్గా రోడ్డులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వకు చెందిన జిట్ట కుమార్(34) ఆదివారం రాత్రి కొత్తూరు వైపు నుంచి స్వగ్రామానికి దర్గా రోడ్డులో బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతడు మేకగూడ శివారులోని భారత్ పెట్రోల్ పంపు సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

బీఆర్ఎస్ నేతలకు పరామర్శ


జైలు ఎదుట బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అక్రమంగా బీఆర్ఎస్ నాయకులపై కేసులు బనాయిస్తుందని పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి సంగారెడ్డి జిల్లా కంది జైల్లో ఉన్న మండలంలోని అల్లవాడ గ్రామానికి నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల మధ్య దసరా పండుగ సమయంలో జరిగిన చిన్న విషయాలను పెద్దవి చేసి గ్రామానికి చెందిన 14 మందిపై కేసులు పెట్టి ముగ్గురిని జైలుకు పంపించారన్నారు. బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి ఇలా రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ కేసులుపెట్టి భయపెడుతుందన్నారు. ఈ కేసులకు బీఆర్ఎస్ పార్టీ భయపడేది లేదన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ముట్టడించారు. ఎమ్మెల్యే లేకపోవడంతో గేటుకు వినతిపత్రాన్ని ఇచ్చి వెనుదిరిగారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ.. గడిచిన మూడేళ్లలో స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రూ.8,300 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి 10 నెలలు కావొస్తున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను యాజమాన్యాలు బంద్ పెడుతుండటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు అద్దె చెల్లించకపోవడంతో ఆయా భవనాల యాజమానులు గేట్లకు తాళాలు వేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. ఫీజుల బకాయిలతో వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు. తక్షణమే ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు వంశీ, నాయకులు తరంగ్, విప్లవకుమార్, లక్ష్మణ్, మధు, సంపత్, సందీప్, విక్కి, వినయ్ పాల్గొన్నారు.


కార్యాలయ గేట్‌కు వినతిపత్రం అతికించుతున్న విద్యార్థులు

కుసుమ రైతులకు అవార్డుల ప్రదానం

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సమావేశం


కార్యక్రమంలో రైతులకు అవార్డులు అందజేస్తున్న అధికారులు

షాబాద్: ఐఎస్ఎఫ్ 764 రకం కుసుమ సాగు చేసిన రైతులకు అవార్డులు ప్రదానం చేసినట్లు భారతీయ నూనె గింజల సంస్థ డైరెక్టర్ డాక్టర్.ఆర్‌కే. మతూర్ పేర్కొన్నారు. సోమవారం వార్షిక రబీ నూనె గింజల సాగుకు(కుసుమ, అవిసె) సంబంధించి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్‌లో భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక దిగుబడుల నిచ్చే కుసుమ రకాల సాగులో యాంత్రీకరణ యాజమాన్య పద్ధతులు, గడిచిన రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని రైతులకు వివరించారు. నూతన కుసుమ వంగడం ఐఎస్ఎఫ్ 764 రకం సాగులో మంచి దిగుబడులు సాధించిన షాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రైతు మధుసూదన్ రెడ్డి, రేగడిదోస్వాడ గ్రామానికి చెందిన రైతు రాజారత్నంలను ఉత్తమ రైతులుగా ఎంపిక చేసి, అవార్డులు అందజేశారు. కుసుమ సాగును ప్రోత్సహిస్తున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్‌ను ఉత్తమ సేవ అవార్డుతో సత్కరించామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సతీష్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్స్ విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులో బీటెక్ పూర్తి చేసిన కట్టమంచి జాన్ అనే యువకుడు జేఎన్‌టీయూలో సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకుంటున్నాడు. సోమవారం అతను వనస్థలిపురం సుష్మా థియేటర్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్,బెక్స్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు గ్రాము ఎండీఎంఏను రూ.2500 చొప్పున తీసుకువచ్చి రూ.5000 గ్రాము చొప్పున విక్రయిస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.

యువకుడి దారుణ హత్య

బాలానగర్: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం ఐడీపీఎల్ అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని పంచశీల కాలనీకి చెందిన రాజ్‌కుమార్ (21)గా గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ కుమార్ రెండేళ్లుగా పంచశీల కాలనీలో నివాసం ఉంటూ లేత్ మిషన్ వర్కర్‌గా పని చేసేవాడు. అతడి గొంతు, వీపుపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సృజనాత్మకతతో ఉపాధి అవకాశాలు

- సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహ
- మొయినాబాద్‌లో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభం


టెక్నో ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు

మొయినాబాద్: ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సంగారెడ్డిలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నర్సింహ సూచించారు. మండల పరిధిలోని కేజీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్–2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు ఇలాంటి ఫెస్ట్‌లతో ఎంతో విజ్ఞానం సంపాదించుకుంటారన్నారు. కొత్త ఆవిష్కరణలు, నూతన సాంకేతికతలను తెలుసుకుంటారన్నారు. టెక్నికల్ ఫెస్ట్‌లో విద్యార్థుల కోసం ఎనిమిది విభిన్న క్లబ్‌లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక వెలికి వస్తుందన్నారు. దీంతో ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. ఈ ఫెస్ట్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డెటా సైన్స్, యాప్ అండ్ వెబ్ డెవలప్‌మెంట్, ఐఓటీ, బ్లాక్ చైన్, గ్రీన్ కన్‌స్ట్రక్షన్ క్లబ్(జీసీసీ), త్రీడీ ప్రింటింగ్ క్లబ్, ఎలక్ట్రిక్ వెహికల్స్ తదితర వాటిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు వినోదం కోసం జెంగా, వీఆర్ క్రికెట్, వైర్‌లూప్, మైండ్ కార్డ్‌లు తదితర అనేక సరదా కార్యక్రమాలు విద్యార్థులను అలరించబోతున్నాయన్నారు. ఈ ఫెస్ట్‌లో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 50కి పైగా కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. రెండు రోజులపాటు ఈ ఫెస్ట్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జకర్వ్ సీఈఓ, కో–ఫౌండర్ అవినాష్ పిట్టి, ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సత్యనారాయణ, డైరెక్టర్ డాక్టర్ రోహిత్, హెచ్ఓటీలు కన్వీనర్లు, లోకేష్, చంద్ర, అఫ్రోజ్, స్టుడెంట్ కౌన్సిల్ సభ్యులు వినయ్‌సాయి, సాయి చరణ్, ఉదయశ్రీ, అడ్మిన్‌హెడ్ రవికిరణ్, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు కలెక్టర్ ప్రశంస


కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న శ్రీను

పహాడీషరీఫ్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 13 కిలోమీటర్ల దూరంలోని పరిసర మున్సిపాలిటీలలో జంతు కళేబరాల తొలగింపులో అంకితభావంతో పని చేసినందుకు గాను జల్‌పల్లి మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ముందారి శ్రీనుకు జిల్లా కలెక్టర్ శశాంక ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఏఈఎంసీ(ఏరోఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఈ మేరకు అతన్ని ఎంపిక చేసింది. ఏర్‌పోర్ట్ జీఎంఆర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో జల్‌పల్లి, తుక్కుగూడ కమిషనర్లు వెంకట్రామ్, వాణిరెడ్డిలతో కలిసి కలెక్టర్ అతనికి ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ రమ


సమావేశంలో పాల్గొన్న ఆర్పీలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని సమావేశ మందిరంలో బాలాపూర్ మండల ఆర్పీల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ రమ, బాలాపూర్ మండల కన్వీనర్ శేఖర్‌యాదవ్, ఆర్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు మంజుల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్పీలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు రూ.6 వేల నుంచి కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్పీలుగా పనిచేస్తున్న మహిళలకు పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, ఉద్యోగ భద్రత, ఐడీ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడి మృతి

మరొకరికి గాయాలు


రఘుపతి (ఫైల్)

మోతీనగర్: విద్యుదాఘాతంతో ఓ సెంట్రింగ్ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన తడాల రఘుపతి (34) నగరానికి వలసవచ్చి జగద్గిరిగుట్ట, ఏవీబి పురంలో ఉంటూ సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం అతను ధర్మారావు అనే వ్యక్తితో కలిసి శ్రీ వివేకానందనగర్‌లో ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించి సెంట్రింగ్ పని నిమిత్తం ఇనప టేప్‌తో కొలతలు తీసుకుంటుండగా పైన ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగలడంతో రఘుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ధర్మారావును ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రఘుపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న ధర్మారావు

ట్రాక్టర్ ట్రాలీ మీదపడి వ్యక్తి మృతి


సురేష్ మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

నిజాంపేట్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ తలపై పడడంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, ముదిగొండ గ్రామానికి చెందిన సురేష్(40) ప్రగతినగర్‌లో ఉంటూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సేకరించే ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం అతను ప్రగతినగర్ నుంచి బాచుపల్లిలోని డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో ట్రాక్టర్ ట్రాలీ కింద ఉన్న అట్టలు తీసేందుకు ట్రాలీ జాకీ పైకి లేపాడు. సురేష్ ట్రాలీ కింద అట్టలు తీస్తుండగా ట్రాలీ సురేష్ మెడపై పడటంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.